క్లుప్తంగా

రక్తనిర్ధారణ పరీక్ష

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్‌రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా ప్రారంభించారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్‌కు అభినందన

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ బి. వైష్ణవిని కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, అధ్యాపకులు అభినందించారు. విజయవాడ పరిధిలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో ఈనెల 1 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపులో కళాశాల విద్యార్థిని బి. వైష్ణవి పాల్గొని ప్రశంసాపత్రం పొందింది. క్యాంపులో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఈమె చక్కటి ప్రతిభ కనబరచడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

జియాలజీలో డాక్టరేట్


హరీష్ విజయ్

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం భూగర్భశాస్త్ర శాఖ పరిశోధకుడు హరీష్ విజయ్‌కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ జియాలజీ విభాగం సహ ఆచార్యులు డా. ఎస్. శ్రీనివాసగౌడ్ పర్యవేక్షణలో 'సెడిమెంటరీ సెరికల్చర్ అండ్ దైర్ ఎన్విరాన్‌మెంటల్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ ది పాపాఘ్ని సబ్ బేసిన్ ఆఫ్ ది కడప బేసిన్' అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

వీరశంకర్‌కు..



కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న వీరశంకర్‌కు గణితంలోని హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగంలో పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. వీరశంకర్ గణిత విభాగంలో విశ్రాంత ఆచార్యులు డాక్టర్ రాంభూపాల్‌రెడ్డి పర్యవేక్షణలో ప్లానరీ చానెల్‌లలో పోరస్ మీడియం ద్వారా అస్థిరమైన మాగ్న టో హైడ్రో డైనమిక్స్ ప్రసరణ ప్రవాహాలపై అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేసినందుకు కర్నూల్ రాయలసీమ విశ్వ విద్యాలయం పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు తెలిపారు.

వైఎస్ఆర్‌సీపీతోనే అభివృద్ధి

కడప కార్పొరేషన్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి జరుగుతోందని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. బుధవారం వైఎస్ఆర్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారని విమర్శించారు. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలు దళారుల ప్రమేయం లేకుండా ప్రజలకే నేరుగా చేరుతున్నాయన్నారు. రహదారులు, సచివాలయాలు, ఆర్‌బీకే సెంటర్లు, పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణంతో అభివృద్ధిని అందలమెక్కించారన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఇంత ప్రగతి సాధించింది కాబట్టే ప్రజలు మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారన్నారు.

మద్యం పట్టివేత

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ పేర్కొన్నారు. బుధవారం నగర శివార్లలోని మామిళ్లపల్లె సమీపంలో గల రింగ్ రోడ్డు వద్ద బెల్ట్‌షాప్‌కు మద్యం తరలిస్తున్న చింతకొమ్మదిన్నె మండలం బీఎస్ తాండాకు చెందిన బుక్కే సురేష్ నాయక్ అనే వ్యక్తి నుంచి దాదాపు 20 క్వాటర్లు మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పొలతల కార్తీక మాస గోడ పత్రాల ఆవిష్కరణ


పొలతల కార్తీక మాస గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలో ప్రారంభమైన కార్తీకమాసంకు సంబంధించిన గోడ పత్రాలను బుధవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు ఆవిష్కరించారు. ఈనెల 20వ తేదీ నుంచి మొదలయ్యే మొదటి కార్తీక సోమవారం నుంచి డిసెంబర్ నెల11వ తేదీ నాల్గవ సోమవారం వరకు క్షేత్రంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే దేవాదాయశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనువాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం


ఎర్రముక్కపల్లెలో సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఉక్కాయపల్లెలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు ఎన్ని నాటకాలు ఆడినా జనం నమ్మరని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ పార్టీ అధ్యక్షులు పి. జయచంద్రారెడ్డి, లక్ష్మయ్య అన్నారు. బుధవారం స్థానిక 21వ డివిజన్‌లోని ఎర్రముక్కపల్లెలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను, ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పద్నాలుగేళ్ల టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ జిల్లాలో చెప్పుకోదగిన అభివృద్ధి కార్యక్రమం ఒక్కటీ చేపట్టలేదన్నారు. వైఎస్ హయాంలోనే జిల్లా అభివృద్ధి జరిగిందని, మళ్లీ ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే జరుగుతోందని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే ఈ సంక్షేమ పథకాలన్నీ యథావిధిగా కొనసాగుతాయన్నారు. 21వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుజాత, ఇన్‌చార్జి ఎం. సుబ్బరాయుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ నాలుగేళ్లలో తమ డివిజన్‌లో సుమారు రూ.9కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని, సుమారు 39 పథకాల ద్వారా రూ.20 కోట్లు ప్రజల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్, జెండా, టోపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి ఎం. రామలక్ష్మణ్‌రెడ్డి, కార్పొరేటర్ కె.సూర్యనారాయణరావు, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉక్కాయపల్లెలో..

కడప నగరం 2వ డివిజన్‌లోని ఉక్కాయపల్లెలో 'ఆంధ్రాకు ఎందుకు జగనే కావాలి' కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు తోటక్రిష్ణ, జేసీఎస్ ఇన్‌చార్జి మల్లికార్జున, 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం.సుబ్బారెడ్డి, రైతు విభాగం నగర అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా వారు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల డివిజన్‌కు, అక్కడి ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్‌లు, కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ నాగేంద్ర, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నాగరాజుపేటలో..

కడప నగరంలోని 30వ డివిజన్ నాగరాజుపేటలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, డిప్యూటీ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి, నార్త్ క్లస్టర్ ఇన్‌చార్జి హరూన్‌బాబులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, సంక్షేమ పథకాల పట్టికను ప్రదర్శించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలి



నిరసన తెలియజేస్తున్న ఏపీజీబీ ఉద్యోగ సంఘాల నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీజీబీ యాజమాన్య మొండివైఖరి నశించాలని ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఏపీజీబీ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ కార్మిక సంఘాల కృషి ఫలితంగా 4.8.2023న కేంద్ర ప్రభుత్వం డిపార్టుమెంటు ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ గ్రామీణ బ్యాంకులకు కంప్యూటర్ ఇంక్రిమెంటు అమలుకు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఆదేశాలు వచ్చిన తర్వాత గ్రామీణ బ్యాంకులు కంప్యూటర్ ఇంక్రిమెంట్లు అమలు చేశాయని, అయితే ఏపీజీబీ యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తూ అమలు చేయకుండా కుంటిసాకులు చూపిస్తోందన్నారు. ఈ మొండివైఖరిని నిరసిస్తూ ఏపీజీబీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని తెలియజేశామన్నారు. ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు సాధించేందుకు రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతంగా ముందుకు తీసుకు వెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జగదీశ్వర్‌రెడ్డి, ఏపీజీబీ ఎంప్లాంస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహమ్మద్, ఏపీజీబీ రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శివశంకర్‌రెడ్డి, ఏపీజీబీ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన


నిరసన తెలియజేస్తున్న దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దస్తావేజు లేఖర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్, నగర అధ్యక్షులు సంజీవరాయుడు డిమాండ్ చేశారు. దస్తావేజు లేఖర్ల ఆందోళన రెండవరోజు బుధవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి నాయకులు ఎగ్బాల్, కృష్ణారావు, లోకనాథం, ఓబులేసు, సురేష్ కుమార్ రెడ్డి, మహేష్, గంగయ్యతోపాటు పలువురు దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు పాల్గొన్నారు.

దాతృత్వం


కడప కల్చరల్ : పాఠశాలకు ఇన్వర్టర్ అందజేస్తున్న దాతలు


కడప అర్బన్ : బారికేడ్లను పరిశీలిస్తున్న సీఐ భాస్కర్‌రెడ్డి


కడప కార్పొరేషన్ : ఆదరణ ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తమ వంతు సహకారంగా శివాణి షాపింగ్ మాల్ వారు ఐదు బారికేడ్లను తయారు చేయించి వితరణగా ఇచ్చారు. వీటిని కడప వన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి ప్రారంభించారు.

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలకు దాతలు ఇన్వర్టర్‌ను అందజేశారు. బాసట స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు డీపీ కార్తీక్‌రెడ్డి, ధరణిల జన్మదినాన్ని పురస్కరించుకుని రూ.25 వేల విలువైన రెండు ఎలక్ట్రికల్ ఇన్వర్టర్లు అందజేశారు. బాసట సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మేరువ బాలాజీరావు, సంస్థ సభ్యులు, పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్ : కార్తీక మాసం సందర్భంగా పాతరిమ్స్‌లోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో టింబర్ డిపో అధినేత కంచి గోపీక్రిష్ణ, సూర్య డెవలపర్స్ అధినేత కె. సురేంద్రనాథ్ సహకారంతో అన్నదానం చేశారు.

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం చెన్నూరు బస్టాండ్ వద్ద ఉన్న వికాస్ విహార్ రాస్ ఎంఆర్ చిల్డ్రన్ మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో కడప ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, కోశాధికారి నాగేష్ చొరవతో సంఘం సభ్యులు శంకరయ్య, నారాయణ, సుబ్బారెడ్డిల సహకారంతో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మానసిక వికాలాంగుల పునరావాస కేంద్ర ప్రిన్సిపాల్ లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర మహా సభలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 15 మహాసభలు ఈ 17 నుంచి 19 వరకు నంద్యాలలో జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కడప నగర కార్యదర్శి వడ్ల భాగ్యలక్ష్మి తెలిపారు.

బుధవారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో మీడియా సమావేశంలో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్ధే లక్ష్యంగా ఏపీ మహిళా సమాఖ్య పోరాడుతున్నదన్నారు. ఎన్నికలు జరగనున్న తరుణంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. మహాసభల్లో భాగంగా నంద్యాల పట్టణంలో ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని, ఈ కార్యక్రమాల్లో మహిళా సమాఖ్య అగ్రనేతలు, వామపక్ష నేతలు పాల్గొంటారని, ఈ మహాసభల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి, ఆచారమ్మ, నిర్మలమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలను అరికట్టాలని ట్రాఫిక్ ఎస్ఐ ఏఎస్ఎన్ కుమార్ అన్నారు. రాయల్ రసీద్ అసోసియేషన్ వారు ట్రాఫిక్ నిబంధనలపై ప్రచార పోస్టర్లను తయారు చేశారు. సంబంధిత పోస్టర్‌ను బుధవారం ట్రాఫిక్ పోలీసులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపరాదన్నారు. అలాగే ఎక్కువ మందితో ద్విచక్ర వాహనంలో వెళ్లడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ రసీద్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, ట్రాఫిక్ పోలీసులు కొండయ్య, గంగులయ్య, శ్రీనివాసులు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

19న కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరం దేవునికడపలోని శ్రీవల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి స్కంధషష్ఠి కల్యాణోత్సవాలను ఈనెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు అర్చకులు సుబ్రమణ్యం, ఈఓ ఎ.శ్రీధర్‌లు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 7 గంటలకు గణపతి పూజ, అభిషేకం, 108 శంఖాల తీర్థాలతో అభిషేకం, ఇతర పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. రాత్రి 7 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను మయూర వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

26న వనభోజనం

కడప కల్చరల్ : పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన నగరంలోని పద్మశాలి భవన్ కల్యాణ మండపంలో శ్రీ భద్రావతి భావనారాయణస్వామి కల్యాణోత్సవం, కార్తీక వనభోజనం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షులు అవ్వారు సుబ్బరాయుడు తెలిపారు. 26న ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 గంటలకు అల్పాహారంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం 1 గంటకు కార్తీక మాస వన భోజన కార్యక్రమం ఉంటుందన్నారు.

నియామక పత్రాల అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని నియోజకవర్గాలకు సమాజ్ వాది పార్టీ ఇన్‌ఛార్జిలను నియమించామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బీవీ సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం కడప నగరంలోని పది నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని ప్రజల్లోకి ఎలా ముందుకు తీసుకెళ్లాలో వివరించారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

చెన్నూరు : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్‌లు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని ప్రాథమిక ఆ రోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని గ్రామపంచాయతీలలో ఉండే ఆరోగ్య ఉప కేంద్రాలను కూడా అభివృద్ధిపరచి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 12 మందికి కంటి చి కిత్స నిమిత్తం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా ఆసుపత్రులకు పంపుతున్నామన్నారు. ఇక్కడ ఓపీతోపాటు, ప్రతి సోమవారం చర్మవ్యాధుల డాక్టర్, జనరల్ మెడికల్ డాక్టర్ అందుబాటులో ఉంటారని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

కార్తీక పూజలు


శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బుధవారం కడప నగరం చిన్నచౌకవీధిలోని శ్రీ బాల పోలేరమ్మ ఆలయంలో కాశీ శివలింగానికి కార్తీక పూజలు నిర్వహించారు. ఈ మాసంలో శివలింగ సమర్పణ పుణ్యదాయకమని భావించిన స్థానిక భక్తులు కాశీ నుంచి స్వయంగా శివలింగాన్ని తీసుకొచ్చి ఆలయ నిర్వాహకులకు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయ ప్రాంగణంలో శివలింగాన్ని భక్తుల సమక్షంలో ప్రత్యేకపీఠంపై కొలువుదీర్చి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కులుగల భక్తులు కోటి ఒత్తుల కార్తీక దీపాన్ని వెలిగించి ఆలయ ప్రదక్షిణల అనంతరం కాశీ లింగానికి, శ్రీ బాలపోలేరమ్మకు దానితో హారతులు సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా టౌన్‌ప్లానింగ్ డే వేడుకలు


టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య బి. అంజనేయప్రసాద్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు అంజనేయప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయ నమూనాలను స్థానిక ప్రణాళిక వ్యూహాలలోకి చేర్చడమే టౌన్‌ప్లానింగ్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రణాళికా విధానాలను స్వీకరించడం, ప్రపంచ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని స్థానిక అవసరాలను తీర్చాలని సూచించారు. అనంతరం టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో 'గ్లోబల్‌గా నేర్చుకోండి.. స్థానికంగా అనువర్తించండి' అన్న అంశంపై పోస్టర్ మేకింగ్, ప్రదర్శనను వీసీ పరిశీలించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. ఇ.సి. సుప్రియ, టౌన్‌ప్లానింగ్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆదివాసుల ఆత్మగౌరవం బిర్సాముండా

ఆదివాసుల ఆత్మగౌరవం బిర్సా ముండా అని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు అంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆదివాసుల ఆరాధ్యదైవం, గిరిజన హక్కుల పోరాట నాయకుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా విశ్వవిద్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ వై. మనోహర్‌రావు, వివిధ విభాగాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం


కలెక్టర్‌కు ఉరుసు ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దర్గా భక్తులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప అమీన్‌పీర్ (పెద్ద దర్గా) ఉరుసు ఉత్సవాలకు రావాలని దర్గా ప్రతినిధులు, భక్తులు కలెక్టర్ విజయరామరాజును ఆహ్వానించారు. దర్గాలో కొలువైన హజరత్ సయ్యద్‌షా మహమ్మద్ మహమ్మదుల్ ఆరీఫుల్లా హుసేనీ చిష్టివుల్ ఖాద్రి సాహెబ్ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26న గంధం, 27న ఉరుసు, 28న తహలీల్ ఫాతెహా జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలకు రావాలని వారు కలెక్టర్‌ను కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞానపు లోగిళ్లు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కడప కల్చరల్ : గ్రంథాలయాలు విజ్ఞానపు లోగిళ్లని, విద్యార్థులకు మనో వికాసం కలిగించడంతోపాటు జ్ఞానవంతుడైన పౌరుడిగా తీర్చిదిద్దగలవని జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ సహాయ సంచాలకులు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండవరోజు ఆయన కడప నగరంలోని కొండాయపల్లెలోగల సంస్థ ప్రధాన కార్యాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు.

ఉత్సాహ భరితంగా పోటీలు..

నగరంలోని పాఠశాలల, జూనియర్ కళాశాల, డిగ్రీ విద్యార్థులకు మున్సిపల్ మెయిన్ హైస్కూలులో చదరంగం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 20కి పైగా పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనీస్ దర్బారి చెస్ అకాడమి సౌజన్యంతో చదరంగం పోటీలను నిర్వహించగా కార్పొరేటర్ సూర్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీకి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. గ్రంథాలయ ప్రతినిధులు పోటీదారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నగర విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం అశ్రిఫూన్, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్ : కడప గాంధీనగర్ హైస్కూల్‌కు చెందిన షేక్‌రీమ, లోహిత, వైష్ణవి, లక్ష్మిలు రాష్ట్రస్థాయి మాల్‌కాం పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన మాల్‌కాం పోటీల్లో తమ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల హెచ్‌ఎం సత్యసుజాతమ్మ, పీఈటీ ప్రసాద్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకుగాను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అశ్రిఫూన్, , పీఈటీ ప్రసాద్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలకు..

కడప స్పోర్ట్స్ : త్వరలో కర్నూలు నగరంలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే వైఎస్ఆర్ కడప జిల్లా జట్టుకు కడప నగరం చెమ్ముమియాపేట బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. బుధవారం చక్రాయపేట మండలం గండి ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపికల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజాకుమారి, ఫిజికల్ డైరెక్టర్ ఎం. ప్రవీణ్‌కిరణ్ తెలిపారు. అండర్–14 విభాగంలో ఎస్. పునీత్‌రాజ్, అండర్–17 విభాగంలో జి. వరుణ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను వారు అభినందించారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి

వల్లూరు : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పూర్తిస్థాయిలో కృషి చేయాలని ఎంపీడీవో కేఆర్ఎం ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు ఇంటింటికీ తిరిగి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి ఆసక్తి గల వారిని ఇందులో పాల్గొనేలా చూడాలన్నారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలకు సంభందించి ఈనెల 20వ తేదీ నుంచి సచివాలయాల్లో క్రీడా కారుల పేర్లు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. డిశంబర్ 15 నుంచి క్రీడలు జరుగుతాయన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ శ్రీధర్ కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో 2 విజయ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దానగుణం అలవరచుకోవాలి

కమలాపురం : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు దానగుణం అలవరచుకోవాలని కమలాపురం, వీఎన్‌పల్లె ఎంఈఓలు సుభాషిణి, జాఫర్ సాదిక్ తెలిపారు. బుధవారం శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులతో షిర్డీసాయి రైస్ మిల్ అధినేత మీగడ రామసుబ్బారెడ్డి తన కుమార్తె యోగితారెడ్డి జన్మదినోత్సవాన్ని పురష్కరించుకుని వితరణ చేసిన దుస్తులను 250 మంది విద్యార్థినులకు వారు అందజేశారు. అలాగే ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జర్నలిస్ట్ జాషువ పీటర్ ఇద్దరు కుమార్తెల పేరిట రూ.20వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన చెక్కులను అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.